క్లుప్తంగా

నవ్యశ్రీకి ఇంటర్‌లో ప్రతిభా అవార్డు



నవ్యశ్రీని అభినందిస్తున్న శ్రీవిజ్ఞాన్ కరస్పాండెంటు గోవిందరావు, డైరెక్టర్లు

చోడవరం రూరల్: ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన సంస్థగా జిల్లాలోనే చోడవరం శ్రీవిజ్ఞాన్ జూనియర్ కళాశాల అగ్రస్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఏపీ ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభా పురస్కారానికి కళాశాల విద్యార్థిని బుద్ధా నవ్యశ్రీ(బైపీసీ 998/1000) ఎంపికైంది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఈర్లె గోవిందరావు, డైరెక్టర్లు బి.రామకృష్ణ, బి.జి.దామోదర్, వై.శ్రీను విద్యార్థిని నవ్యశ్రీని అభినందించారు.

'పని భారం పెంచడం అన్యాయం'



బుచ్చెయ్యపేటలో మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కొమ్ముకాసేలా కార్మికుల పనిదినాలు పెంచడం అన్యాయమని సీఐటీయూ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం బుచ్చెయ్యపేటలో పలు కార్మిక సంఘ నాయకులతో జరిగిన సమీక్ష సమావేశంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాసరావు, సాంబశివరావు, తదితరులు ప్రభుత్వ నిర్ణయంపై ఆగ్రహం చెందారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు కార్మికులకు చేస్తున్న అన్యాయాలపై త్వరలో ఉద్యమాలు చేస్తామన్నారు. తక్షణం 8 గంటల ఉన్న పని దినాలను 12 గంటలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

పిడుగు పడి గడ్డివాముల దగ్ధం



పిడుగు పాటుకు దగ్ధమవుతున్న గడ్డివాములు

నర్సీపట్నం: నర్సీపట్నం మండలం, గురందరపాలెంలో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో మోస్తారు వర్షం పడింది. పెద్ద ఉరుములకు పిడుగుపడి రెండు గడ్డివాములు, రెండు ఎపశువుల పాక దగ్ధమయ్యాయి. పశువులను మేతకు తొలుకువెళ్లడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ అప్పలస్వామి, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను ఆదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

వేడుకగా కోదండ రామస్వామి ఆలయ ప్రారంభోత్సవం



పూజలు చేస్తున్న ఎంపీపీ పైల రాజు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

రావికమతం: మండలంలోని కేబీపీ అగ్రహారం పంచాయతీ శివారు ఎర్రబంద గ్రామంలో శుక్రవారం కోదండ రామస్వామి ఆలయ ప్రారంభోత్సవం, దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్టాపన వేడుకగా జరిగాయి. పురాతన రామాలయం స్థానంలో గ్రామస్తులు విరాళాలతో పునర్నిర్మించారు. వేకువజాము నుంచి హోమం, అభిషేకాలు చేశారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, ఎంపీపీ పైల రాజు, సర్పంచ్ సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, మండల కన్వీనర్ కంచిపాటి జగ్గారావు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ సత్యదేవా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిమూర్తి, పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

జాబ్ మేళాకు 270 మంది హాజరు



జాబ్‌మేళాకు హాజరైన యువకులు

మాడుగుల: స్థానిక డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. 20 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు జరిపారు. 270 మంది ఈ జాబ్‌మేళాకు హాజరు కాగా.. 120 మంది ఎంపికైనట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు తెలిపారు. ఈ మేళాలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించి, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, తహసీల్దార్ రమాదేవి, ఉందూరు దేముడు, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నెరవేరని ఉపాధి లక్ష్యం..!



ఇటీవల వర్షాలకు చుక్కనీరు లేని దివాన్‌సాగర్ చెరువు

నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్న ఉద్దేశంతో ఉపాధి హామీ పథకం కింద చెరువుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. అయితే కాలువల్లో పూడిక తీత, మదుముల మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇటీవల ఏప్రిల్, మే నెలల్లో అడపాదడపా వర్షాలు కురిసినా చెరువుల్లోకి చుక్కనీరు రాని పరిస్థితి నెలకొంది. లక్షలాది రుపాయల ఉపాధి హామీ నిధులతో సాగునీటి చెరువుల్లో చేపడుతున్న పూడికతీత పనులు అక్కరకు రాకుండా పోతున్నాయి.

- వర్షాలకు చెరువుల్లోకి చేరని చుక్క నీరు
- లక్షలాది ఉపాధి నిధులతో చెరువుల్లో పూడిక తీత, గట్ల పటిష్టత
- కాలువల్లో మరిచిన పూడిక తీత, మదుముల మరమ్మతులు
- చౌడువాడలో దివాన్ సాగర్, గైరమ్మ చెరువులు వెలవెల

కె.కోటపాడు : కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నా చెరువుల్లో చుక్క నీరు చేరలేదు. మండలంలో మేజర్ పంచాయతీ చౌడువాడ గ్రామంలో సచివాలయం ఎదురుగా ఉన్న దివాన్ సాగర్, గైరమ్మ చెరువులు ఉన్నాయి. ఈ రెండు చెరువులు ఒక్కింటికి రూ.9.90లక్షల ఉపాధి నిధులు కేటాయించి పూడికతీత పనులు, చెరువు గట్ల పటిష్టత చేపట్టారు. అయితే ఈ చెరువుల్లోకి వర్షం కురిసే సమయాల్లో నీరు ప్రవహించే ప్రధాన కాలువల్లో పూడికతీత పనులు, మొక్కలను తొలగించే ప్రక్రియ చేపట్టలేదు. దీంతో రెండు చెరువుల్లోకి చుక్క వర్షపు నీరు రాని పరిస్థితి నెలకొంది.

అడుగంటనున్న భూగర్భ జలాలు

గ్రామంలోని ఈ రెండు చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంటే భూగర్భ జలాలు మెరుగ్గా ఉంటాయి. ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన చేతిబోర్లతో పాటు గృహాల్లో ఏర్పాటు చేసుకున్న బోర్లకు నీరు పుష్కలంగా వస్తాయి. ప్రస్తుతం రెండు చెరువుల్లో కూడా ఇటీవల వర్షాలకు చుక్క నీరు రాని దుస్థితి ఎదురైంది.

రాబోయే వర్షాకాలంలో కూడా ఇదే పరిస్థితి ఉంటే భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉంది. అసలే గ్రామం మెట్ట ప్రాంతంలో ఉండడం వల్ల నీటి ఇబ్బందులు ప్రజలకు కలగనున్నాయి.



ఇటీవల ఉపాధి నిధులతో గౌరమ్మ చెరువులో చేపట్టిన పూడికతీత పనులు

కూలిన మదుములు.. పూడుకుపోయిన కాలువలు



దివాన్‌సాగర్ చెరువుకు వర్షపునీరు ప్రవహించే కాలువలతో పేరుకుపోయిన పూడిక, మొక్కలు



మరమ్మతులకు గురైన సిమెంట్ కాలువ

దివాన్ సాగర్ చెరువుకు అద్దూరు కొండ ప్రాంతం నుంచి వర్షపు నీరు ప్రవహించేందుకు సుమారు 3 కిలోమీటర్ల పొడవునా మట్టి కాలువ ఉంది. ఈ కాలువలో మట్టి పూడికపోవడంతో పాటు పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఈ కాలువ నీరు చెరువులోకి ప్రవహించేందుకు మదుముల నిర్మాణం చేపట్టి సుమారు 20 ఏళ్లకు పైగా అయింది. ఈ మదుములు ప్రస్తుతం మరమ్మతులకు గురయ్యాయి. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి, మదుములకు మరమ్మతులు చేపడితే పుష్కలంగా వర్షపు నీరు దివాన్‌సాగర్ చెరువులోకి చేరుతుంది. అదే విధంగా గైరమ్మ చెరువులోకి నీరు ప్రవహించే కాలువలు ప్రస్తుతం పూడికపోయాయి. వర్షపు నీరు ఈ చెరువులోకి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈ రెండు చెరువుల సమస్యపై అధికారులు దృష్టి సారించి వర్షపునీరు వచ్చే పరిస్థితి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలోని సుమారు 9 వేల మంది ప్రజలకు మేలు చేకూర్చే ఈ రెండు చెరువుల మదుములు, కాలువలకు మరమ్మతు పనులు, పూడికతీత పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. చెరువుల్లోకి నీరు రాకపోవడంతో లక్ష్యం నీరుగారే పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది చుక్క నీరు రాలేదు..



దివాన్ సాగర్ చెరువు ప్రస్తుతం ఎండిపోయి ఉంది. ఇటీవల వర్షాలకు చుక్కనీరు చెరువులోకి రాలేదు. నీరు ప్రవహించే కాలువలు పూడికపోయి ఉన్నాయి. మదుములు మరమ్మతులకు నోచుకోలేదు. చెరువుల్లో నీరు ఉంటే పుష్కలంగా బోర్ల వెంబడి నీరు వస్తుంది. లేని పక్షంలో బోర్లు వెంబడి నీరు రాకపోవడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటుతాయి. ఉపాధి నిధులతో చెరువుల్లోకి నీరు ప్రవహించే కాలువల్లో కూడా పూడిక తీత పనులు చేపట్టాలి.

– ఏటుకూరి రాజేష్,
ఎంపీటీసీ, చౌడువాడ

అనకాపల్లి ఉద్యానవన క్షేత్రంలో అందుబాటులో మొక్కలు



ఉద్యాన వన క్షేత్రంలో సిద్ధంగా ఉన్న కొబ్బరి మొక్కలు

మాడుగుల రూరల్: అనకాపల్లి గుండాల దగ్గర ఉన్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి కార్యాలయం ఆవరణలోని ఉద్యానవన శాఖ క్షేత్రంలో వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నట్టు మండల ఉద్యానవన శాఖాధికారి వి.భానుపుష్ప లీలావతి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆమె సాక్షితో మాట్లాడారు. 45 వేల కొబ్బరి మొక్కలు క్షేత్రంలో ఉన్నాయని, ఒక మొక్క ఖరీదు రూ.95, మామిడి మొక్కలు 15 వేలు ఉండగా.. ఒక మొక్క ఖరీదు రూ.45, జీడిమామిడి మొక్కలు 8,500 ఉండగా, మొక్క ఖరీదు రూ.40, నిమ్మ మొక్కలు 2 వేలు ఉండగా.. మొక్క ఖరీదు రూ.25కు విక్రయిస్తామన్నారు. కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా జెరాక్సును తీసుకుని, ఉద్యానవన క్షేత్రంలో సంప్రదించాలన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన



ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న భక్తులు

రోలుగుంట: స్థానిక కొండల మధ్య వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజ స్తంభం ప్రతిష్టాపన, మహాలక్ష్మమ్మ విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దాత లాలం బుజ్జి సమకూర్చిన 43 అడుగుల ధ్వజ స్తంభాన్ని వేద మంత్రాలతో మధ్య ప్రధాన అర్చకుడు రేజేటి శ్రీనివాసాచార్యులు ప్రతిష్టించారు. ఆలయ ఆవరణలో నిర్మించిన అమ్మవారి విగ్రహాన్ని పునః ప్రతిష్టించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా వెంకన్నస్వామి వార్షిక కల్యాణం

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో కల్యాణ వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక కల్యాణోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముందుగా స్వామి వారి ఎదురు సన్నాహం నిర్వహించారు. అనంతరం నలుగురు దంపతులు స్వామి కల్యాణం జరిపారు. స్వామిని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్త రాపేట రామకొండలరావు, ఉత్సవ కమిటీ కన్వీనర్ కాళ్ల అప్పలనాయుడు, కోకన్వీనర్లు పుట్టా రాంబాబు, పుట్టా బలరామ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తగరపువలస వద్ద ఉన్న అనిల్ నీరుకొండ ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో సుమారు 500 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం వద్ద భజన సమ్మేళనం నిర్వహించారు.



వేంకటేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

మృతుని కుటుంబానికి రూ.28 లక్షల పరిహారం


బుచ్చెయ్యపేట: మండలంలోని ఎల్‌బీ పురం గ్రామంలో విద్యుత్ షాక్‌తో మరణించిన మృతుని కుటుంబానికి పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం పరిహారం అందించింది. ఎల్‌బీ పురానికి చెందిన పల్లా అప్పన్న(29) స్థానిక పామాయిల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. గత నెల 7న ఫ్యాక్టరీలో ఉన్న తాటి కాయలను ఇనుప కత్తితో కోస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. అప్పట్లో మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, కమ్యూనిస్టు పార్టీల నాయకులు ఫ్యాక్టరీలో అప్పన్న మృతదేహంతో ఆందోళన చేపట్టారు. దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యం మృతుని కుటుంబానికి రూ.28 లక్షల పరిహారం ఇవ్వడానికి అంగీకరించింది. ఈ మేరకు శుక్రవారం ఫ్యాక్టరీ మేనేజర్ కె.మోహన్, ఫీల్డ్ మేనేజర్ ఎం.శ్రీనివాసరావు, సైట్ మేనేజర్ నాగబాబు.. అప్పన్న భార్య రేవతికి రూ.28 లక్షల డీడీని ఎమ్మెల్యే రాజు చేతుల మీదుగా అందించారు. నాయకులు దాసు, సత్యనారాయణ, శ్రీను, శేషు, తదితరులు పాల్గొన్నారు.



రేవతికి రూ.28 లక్షల డీడీని అందిస్తున్న ఫ్యాక్టరీ సిబ్బంది

యోగా సంజీవిని

నర్సీపట్నం: సకల రోగాలకు యోగా సంజీవినిలా దోహదపడుతుందని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర పేర్కొన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శారదానగర్‌లో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు, వారి కుటుంబ సభ్యులు, బాలబాలికలతో 400 మందితో యోగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాను దినచర్యల్లో భాగం చేస్తే ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా ఉంటామన్నారు. అనంతరం యోగా గురువు రాయపురెడ్డి శ్రీనివాసరావు, ఆయుష్ వైద్యులు యశోదాదేవి, సిబ్బంది యోగా సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో మెప్మా మేనేజర్ రమాదేవి, పురపాలిక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



యోగాసనాలు నేర్పిస్తున్న గురువు శ్రీనివాసరావు

'పరిశుభ్ర వాతావరణంలో మధ్యాహ్న భోజన తయారీ'

కె.కోటపాడు : పరిశుభ్రమైన వాతావరణంలో మధ్యాహ్న భోజనం తయారు చేయాలని ఎంఈవోలు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ సూచించరాఉ. కె.కోటపాడు హైస్కూల్‌లో శుక్రవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. భోజన తయారీలో జాగ్రత్తలు పాటిస్తూ రుచికరంగా తయారీ చేసి విద్యార్థులకు అందించాలన్నారు. నిర్వాహకులు భోజనం విద్యార్థులకు వడ్డించే సమయంలో చేతులకు గ్లౌజులు ధరించాలని సూచించారు. కిచెన్ షెడ్‌తో పాటు ఆ పరిసరాలు పరిశుభ్రతతో ఉండేటట్లు నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరు బయట వండరాదన్నారు. కార్యక్రమంలో భాగంగా భోజన తయారీ చేయడంపై నిర్వాహకులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఆర్లి ఎంపీయూపీ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ప్రథమ, రొంగలినాయుడుపాలెం ఎంపీపీ పాఠశాల నిర్వాహకులకు ద్వితీయ బహుమతి పొందారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌ఎంటీ నాయుడు, సింహాచలం, డీటీఈవో శివాని, దేవీలక్ష్మి, శ్రీను, ప్రకాష్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



భోజన నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవోలు సత్యనారాయణ, ప్రసాద్

మలేరియాపై అవగాహన ర్యాలీ

రావికమతం: కొత్తకోట పీహెచ్‌సీ పరిధిలోని జెడ్.బెన్నవరంలో శుక్రవారం మలేరియా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాలు పరిశుభ్రతపై ప్రజలకు వివరించారు. దోమ తెరలు వాడాలని సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి పాతాళ రామారావు, హెచ్ఎస్ రమణ, సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ చేస్తున్న కొత్తకోట పీహెచ్‌సీ సిబ్బంది

ఐదెకరాల్లో నీట మునిగిన పంట పొలాలు

- కాయగూరలు, నువ్వు, వరి పంటలకు ముప్పు
- జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యమే ముంపునకు కారణమని రైతుల ఆగ్రహం

దేవరాపల్లి: రైవాడ జలాశయం నుంచి మహా విశాఖ నగరానికి(జీవీఎంసీ) మంచినీటి సరఫరా చేసే కాలువకు ఆనుకొని ఉన్న దేవరాపల్లికి చెందిన రైతుల పంట పొలాలు నీట మునిగాయి. పొలాల్లో చేరిన వరద నీరు బయటకు పోయే మార్గాన్ని మూసివేయడంతో సుమారు ఐదెకరాల్లో సాగు చేసిన బరబాటి, ఆనప, కాయగూర పంటలతో పాటు నువ్వు, వరి తదితర పంటలు మునిగిపోయాయి. దేవరాపల్లికి చెందిన కొరుప్రోలు ఆదిబాబు, ఎలిసెట్టి అప్పారావు, నెమలికంటి మహేష్, కొరుప్రోలు రాజుబాబు, కొరుప్రోలు చినబాబు తదితర రైతుల పంట పొలాలు నీటి మునగడంతో సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. రైవాడ జలాశయం నుంచి జీవీఎంసీకి మంచినీటిని సరఫరా చేసే కాలువపై 0.350 కిలోమీటరు వద్ద సంబంధిత రైతులు పైపు కల్వర్టును కాలువ తవ్విన సమయంలో నిర్మించారు. వరదల సమయంలో ఇక్కడి పొలాల్లో చేరిన వరదనీరు ఈ మదుంలో నుంచి కాలువ అవతలి గట్టుకు ఆనుకొని ఉన్న కాలువ ద్వారా దిగువ ప్రాంతానికి ప్రవహించేది. ఈ పైపు కల్వర్టు దగ్గర కాలువ ఎడమ గట్టు వరద నీటి ప్రవాహం ధాటికి ఇటీవల కోతకు గురైంది. కోతకు గురైన ప్రాంతంలో జీవీఎంసీ అధికారులు ఇటీవల మరమ్మతులు చేపట్టారు. ఆ సమయంలో పైపులు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పైపుల స్థానంలో కొత్త పైపులు వేయకుండా ఆ మదుంకు అడ్డంగా గ్రావెల్ వేసి పూడ్చారు. దీంతో పొలాల్లో చేరే అదనపు నీరు బయటకు వెళ్లే దారి మూసుకుపోయింది. ఇటీవల ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు భారీగా చేరిన వరద నీటితో పంట పొలాలు పూర్తిగా నీటిలో మునిగిపోయాయి. ఆనప, బరబాటి కాయగూరలతో పాటు నువ్వు, వరి పంట పూర్తిగా దెబ్బతింది. జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ముంపు సమస్య ఏర్పడిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవడంతో పాటు పూడ్చేసిన మదుంను పునర్నిర్మించాలని బాధిత రైతులు కోరారు.



దేవరాపల్లిలో నీట మునిగిన పొలాల్లోని దెబ్బతిన్న కాయగూరలను చూపిస్తున్న బాధిత రైతులు



జీవీఎంసీ అధికారులు పూడ్చేసిన మదుంను చూపిస్తున్న బాధిత రైతులు


వేడుకగా పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



తూటిపాలలో పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెం: మండలంలోని తూటిపాలలో శుక్రవారం పంచముఖ ఆంజనేయ స్వామితోపాటు వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు గిడుతూరు విద్యార్థి ఎంపిక



లక్ష్మీప్రసన్న

మాకవరపాలెం: మండలంలోని గిడుతూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికైందని ఎంఈవో మూర్తి శుక్రవారం తెలిపారు. 2025 ఏడాదికి సంబంధించి ఈ పాఠశాలలో చదువుతున్న పోలిరెడ్డి లక్ష్మీప్రసన్న ఎంపికైందన్నారు. ఇంటర్ పూర్తయ్యేంత వరకు రూ.లక్ష వరకు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు



నర్సీపట్నం గ్రంథాలయంలో విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపిక అందిస్తున్న ఎంఈవోలు



చౌడువాడలో విద్యార్థులకు మెమెంటో, మెడల్స్ అందిస్తున్న గ్రంథాలయాధికారి పద్మావతి

నర్సీపట్నం: వేసవి సెలవులు నేపథ్యంలో స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఎంఈవోలు సిహెచ్.తలుపులు, నాగేంద్ర విచ్చేసి స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర–2047 విజన్‌పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దమయంతి, విశ్రాంత గ్రంథాలయ అధికారి మురళి, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకరరావు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : చౌడువాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలు, వ్యాసరచన, డిబేట్, యోగా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు గ్రంథాలయాధికారి పద్మావతి ప్రశంసా పత్రాలు, మెమెంటో, మెడల్స్‌ను అందించారు.

చీడికాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయ అధికారి ఎం.జోగేశ్వరి బహుమతులు ప్రదానం చేశారు.



చీడికాడ శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన



పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

రోలుగుంట: ఇటీవల పహల్గామ్ ఉగ్రదాడిని ఖండిస్తూ రోలుగుంటలో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. భారత దేశ సమైక్యత వర్ధిల్లాలని, మతతత్వం నశించాలని, మతసామరస్యాన్ని కాపాడాలని, యుద్ధోన్మాదాన్ని వ్యతిరేకిస్తూ పలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వరలక్ష్మి మాట్లాడుతూ దేశ సైనికులు ఎంతో ధైర్య సాహసాలతో పాక్ ఆక్రమిత ప్రాంతాల్లో ఉగ్రవాద స్థావరాలను ముట్టబెట్టడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు ఇ.చిరంజీవి, ఎండీఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రసన్న, మండల అధ్యక్షురాలు అమ్మాజి, తదితరులు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం



దేవరాపల్లి మండలం తిమిరాంలో కూలిన విద్యుత్ స్తంభం

దేవరాపల్లి/చీడికాడ/కె.కోటపాడు/మాడుగుల రూరల్: పలు మండలాల్లో శుక్రవారం మధ్యాహ్నం గాలి వాన బీభత్సం సృష్టించింది. దట్టమైన ఈదురుగాలు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం ధాటికి పలు చోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దేవరాపల్లి మండల వ్యాప్తంగా 9 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వీటిలో బోయిలకింతాడలో రెండు, కలిగొట్లలో నాలుగు, మామిడిపల్లిలో రెండు, తిమిరాంలో ఒక విద్యుత్ స్తంభం నేలమట్టమయ్యాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎలక్ట్రికల్ ఏఈ కె.శంకరరావు విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో సిబ్బందితో కలిసి నిమగ్నమయ్యారు. దాదాపుగా అన్ని గ్రామాల్లో విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నట్లు ఏఈ తెలిపారు. నాలుగు రోజులుగా కాస్తున్న తీవ్ర ఎండలు, వడగాడ్పులకు శుక్రవారం కురిసిన భారీ వర్షం ఊరటనిచ్చింది. వాతావరణం చల్లబడడంతో పాటు మెట్ట గ్రామాల్లోని చెరకు, కార్షి తోటలు, ఊడుపు తోటలకు ఈ వర్షం ఎంతో మేలు చేకూర్చుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. కె.కోటపాడు, చౌడువాడ, ఎ.కోడూరు, ఆనందపురం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. మాడుగులలో వర్షం పడడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.